ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అమలుచేయాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల షెడ్యూలు విడుదలైన నాటి నుంచి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున ఆర్ఓలకు సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియామవళి అమల్లోకి వచ్చిన నాటి నుంచి లబ్దిదారులకు జారీ చేసే అర్హత పత్రాలు, శిలాఫలకాలలో ముఖ్యమంత్రులు, మంత్రులు, ఇతర రాజకీయ ప్రతినిధుల ఫొటోలు గాని, వారి సందేశాలు గాని ఉండరాదని అన్నారు. అలాగే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిన నాటి నుంచి జారీ చేయబడే విద్యుత్, తాగునీరు, ఇతర బిల్లులపై కూడా ముఖ్యమంత్రులు, మంత్రులు, ఇతర రాజకీయ ప్రతినిధుల ఫోటోలు గాని, వారి సందేశాలు గాని ఉండరాదని తేల్చిచెప్పారు. ఎన్నికల షెడ్యూలుకు ముందు జారీ చేసిన లబ్దిదారుల ధృవపత్రాలు, శిలాఫలకాలపై ప్రచురించబడిన ఫొటోలు, రాజకీయ ప్రతినిధుల సందేశాలపై ఎటువంటి జోక్యం అవసరం లేదని వివరించారు.

రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న వారిని ఆదుకోవాలి

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 91వ వార్డు లక్ష్మీ నగర్ రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధితులు జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో మర్రిపాలెం ఉడా లేఅవుట్ పార్టీ కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్‌ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు రోడ్డు విస్తరణ 80 అడుగుల రోడ్డును 40 అడుగులకు కుదించుటకు, రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధితులు ఇంటి నిర్మాణమునకు నష్టపరిహారం నగదు రూపేనా ముందుగా చెల్లించుటకు, ఎవరిదైనా స్థలం పాక్షికంగా నష్టపోతే నష్టపోయిన స్థలమునకు నాలుగు రెట్లు టిడిఆర్ ఇప్పించాలని వినతిలో కోరారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోయిన బాధితులకు సంబంధిత అధికారులతో సంప్రదించి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ద్రోణంరాజు శ్రీవత్సవ్ పుట్టినరోజు సందర్భంగా బెహరా భాస్కరరావు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు, పశ్చిమ నియోజకవర్గం పరిశీలకులు పేడాడ రమణి కుమారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బండి దుర్గేష్, తెలుకుల రమేష్, ఉమామహేశ్వరరావు, ఐ.శ్రీనివాస్, కే.రాజు, డి.వెంకట్, శ్రీను పాల్గొన్నారు.

వీధి విక్రయదారులకు రక్షణ కల్పించాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వీధి విక్రయదారులకు రక్షణ కల్పించి, టౌన్ వెండింగ్ కమిటీతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వీధి విక్రయ దారుల కార్మిక ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెద్దు వెంకటేశ్వరరావు శుక్రవారం జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. జీవీఎంసీ పరిధిలో ఉన్న ఎనిమిది జోన్లలో దాదాపు రెండు లక్షల మంది వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఐడి కార్డుల కోసం చెల్లించిన రుసుము దాదాపు రెండు కోట్ల నిధులను జీవీఎంసీ ఏడీసీ వై.శ్రీనివాసరావు దుర్వినియోగానికి పాల్పడ్డారని వెంకటేశ్వరరావు ఆరోపించారు. ఫుడ్ కోర్ట్ ఏర్పాట్లు అక్రమాలను వెలికి తీయాలని, ప్రత్యేక హాకర్ జోన్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టౌన్ వెండింగ్ కమిటీ చైర్మన్‌గా జీవీఎంసీ కమిషనర్ వ్యవహరించి వీధి విక్రయదారులకు న్యాయం చేయాలని కోరారు. టౌన్ వెండింగ్ కమిటీలు 60 శాతం మంది తమ ఫెడరేషన్ వారికి అవకాశం కల్పించాలని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు.

నీటి వనరులను కాపాడుకోవాలి

విశాలాంధ్ర - గాజువాక: చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్ పాఠశాలలో ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహించారు. ముందుగా పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు మాట్లాడుతూ భవిష్యత్తులో నీటి కొరత లేకుండా ఉండాలంటే పొదుపుగా వాడడం అలవర్చుకోవాలని, నీరు వృథా కాకుండా అందరూ బాధ్యత వహించాలని అన్నారు. ప్రతీ ఇంటి ఆవరణలో వర్షపు నీరు కోసం ఇంకుడు గుంతలు తవ్వించాలని, వర్షపునీరు వృథాగా సముద్రం పాలవకుండా ఉండేందుకు ప్రభుత్వం నదులు, కాలువలపై ఎక్కువ ఆనకట్టలు నిర్మించాలని విద్యార్థులకు వివరించారు. 8వ తరగతి విద్యార్థులు నీటి పొదుపును వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది గౌతమి, సునీత పాల్గొన్నారు.

గీతం టెక్ ఎక్స్‌పో -24లో యువ సాంకేతిక ప్రతిభ

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం, ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజనీర్స్ (ఐఇటిఇ) సంయుక్త నిర్వహణలో జరుగుతున్న జాతీయ స్థాయి సాంకేతిక యువజనోత్సవం ఐ స్క్వేర్ ఆర్-204లో భాగంగా శుక్రవారం టెక్ ఎక్స్‌పో నిర్వహించారు. ఇంజనీరింగ్ విద్యార్థుల నూతన ఆలోచనలకు వేదికగా టెక్ ఎక్స్‌పో విశేషంగా ఆకట్టుకుంది. సెక్యూరిటీ అంశాలతో పాటు వంట పొలాలపై పురుగుల మందులు పిచికారి చేసే డ్రోన్‌ను విద్యార్థులు ప్రదర్శనలో ఉంచారు. యువజనోత్సవం ముగింపు సదర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ హాజరయ్యారు. ఐ స్క్వేర్ ఆర్ కన్వీనర్ బి.సెవెన్త్ లైన్, ఫ్యాకల్టీ సలహాదారులు డాక్టర్ పి.రాజు, ఎన్.వి.ఎస్.వి.విజయకుమార్, డాక్టర్ ఎస్.శారదరాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - పీఎం పాలెం: పీఎం పాలెం, గాయత్రి నగర్‌లో చిల్ల సంతోష్ (26) అనే వ్యక్తి కరెంట్ షాక్‌తో మృతి సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. తల్లి చిల్ల అప్పలరాము, తండ్రి చిల్ల సింహాచలం కాగా, సొంత ఊరు చిల్లపలెం గ్రామం, భీమసింగ్ పంచాయితీ, జామి మండలం, విజయనగరం జిల్లాగా గుర్తించారు. ఓ ప్రైవేట్ భవనంలో ప్లంబింగ్ పని చేస్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలిసింది. సంఘటన స్థలానికి పిఎం పాలెం పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్ఆర్ఐ కళాశాలలో క్షయ దినోత్సవం

విశాలాంధ్ర - భీమిలి: సంగివలస ఎన్.ఆర్.ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలలో ప్రపంచ క్షయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ప్రొఫెసర్ డా. సున్నం సత్యశ్రీ, ప్రేమ్ కుమార్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా డా. సున్నం సత్యశ్రీ మాన్ విత్ ఏ గోల్డెన్ హాం అనే పుస్తకం ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డా. పి.వి.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డా. శ్రీధర్ రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డా. కృష్ణ మూర్తి శాస్త్రి, డా. భార్గవ్ ప్రసాద్, హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్, ఫ్యాకల్టీ ఆఫ్ రెస్పిరేటరీ మెడిసిన్, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి. శివ ప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షునిగా అనిల్

విశాలాంధ్ర - మల్కాపురం: విశాఖ జిల్లా వైస్సార్‌టీయూసీ అధ్యక్షునిగా రాయపురెడ్డి అనిల్ కుమార్‌ను నియమించారు. గతంలో వైఎస్సార్‌టీయూసీ నగర ప్రధాన కార్యదర్శిగా నిస్వార్థ సేవలందించి అనేకమంది యువతకు ఉపాధి కల్పనదిశగా పనిచేసిన అనిల్‌కు యూనియన్ జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం పట్ల వైసిపి కార్యకర్తలు, యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పించడంలో తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు.

గండి బాబ్జికి తగిన ప్రాధాన్యం కల్పిస్తాం

లోకేష్ హామీతో మెత్తబడిన గండి బాబ్జి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మిత్రపక్షాల పొత్తులో భాగంగా దక్షిణ నియోజకవర్గంలో టిక్కెట్ కోల్పోయిన గండి బాబ్జీకి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువ నేత నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు తెలిసింది. శుక్రవారం విజయవాడలో విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీ భరత్‌తో కలిసి లోకేష్‌తో సమావేశమయ్యారు. గత మూడేళ్లుగా విశాఖ దక్షిణ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి బాబ్జీ చేసిన కృషి మరువలేనిదని, పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత బాబ్జీ కి తగిన ప్రాధాన్యత ఉంటుందని స్పష్టమైన హామీ ఇచ్చినట్లు సమాచారం. దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్‌గా తిరిగి బాబ్జీ కొనసాగుతారని, పార్టీ కోసం కష్టపడే వ్యక్తులకు ఎప్పుడు అండగా ఉండటం టీడీపీ బాధ్యత అని అధినేత చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి లోకేష్ హామీ ఇచ్చినట్లు తెలిసింది.

భీమిలిపై కొనసాగుతున్న ఉత్కంఠ

మూడో విడత అభ్యర్థుల ప్రకటనలో దక్కని చోటు

విశాలాంధ్ర - భీమిలి: టీడీపీలో ఇంకా టికెట్లు పంపకం కొలిక్కి రాకపోవడంతో మరో 5 స్థానాల్లో సస్పెన్షన్ కొనసాగుతూనే ఉంది. శుక్రవారం టీడీపీ విడుదల చేసిన మూడో విడత అభ్యర్థుల జాబితాలో కూడా భీమిలి లేకపోవడంపై ఉత్కంఠ కొనసాగుతుంది. విశాఖ జిల్లాలో భీమిలి నియోజకవర్గం పెండింగ్‌లో ఉండటంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. భీమిలి నియోజకవర్గం కూటమి అభ్యర్థి ప్రకటన లేకపోవడంతో టీడీపీ, జనసేన వర్గాల్లో ఇంకా అభ్యర్థి తేలక పోవడంతో, కూటమిలో వర్గ పోరు కుదరకపోవడంతో క్యాడర్ తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. అయితే ఈసారి ఎన్నికల్లో తొలి నుండి భీమిలి నియోజకవర్గంలో తనకు టిక్కెట్ ఇవ్వాలని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పట్టుపట్టారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఈసారి గంటాను విజయనగరం జిల్లా చీపురుపల్లికు వెళ్లి బొత్సపై పోటీ చేయాలని ఇప్పటికే పలుమార్లు చెప్పినప్పటికీ ససేమిరా అన్న గంటా భీమిలి కోసమే పట్టుబడుతున్నారు. జనసేన బీజేపీ పొత్తులో భాగంగా టీడీపీ ఇప్పటి వరకు తొలి విడత 94 సీట్లు ప్రకటించగా, రెండో విడతలో 34 సీట్లను ప్రకటించింది. మూడో విడతగా శుక్రవారం మరో 11 స్థానాలను ప్రకటించింది. ఇంకా ఐదు స్థానాలు పెండింగ్‌లో ఉండగా అవి ఉత్తరాంధ్ర జిల్లాల్లో అటు చీపురుపల్లి, ఎచ్చెర్ల, భీమిలి నియోజకవర్గం అభ్యర్థుల ప్రకటన జరగలేదు. విశాఖ నగరానికి, జిల్లాకు ఆయువుపట్టుగా ఉన్న భీమిలి నియోజకవర్గం రానున్న ఐదేళ్లలో మరింత కీలకం కానున్న నేపథ్యంలో అభ్యర్థి ఎంపిక టీడీపీకి తీవ్ర తలనొప్పిగా మారింది. ఈ నియోజకవర్గంలో టీడీపీ నుండి గంటా శ్రీనివాసరావు, కోరాడ రాజబాబు, జనసేన నుండి పంచకర్ల సందీప్ కుమార్ టికెట్లు కోసం తీవ్రంగానే శ్రమిస్తున్నారు. రాష్ట్రంలో అత్యంత హాట్ కేక్‌లా ఉన్న భీమిలి నియోజకవర్గంలో సరైన వారిని దింపాలని కూటమి భావించినట్లు తెలుస్తుంది.

ప్రైవేట్ పోర్టులో మాదక ద్రవ్యాల కేసు దర్యాప్తు సీబీఐదే

నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

విశాలాంధ్ర - విశాఖ క్రైం: ఇంటర్ పోల్ సమాచారం మేరకు బ్రెజిల్ నుంచి వచ్చిన ఓ కంటైనర్‌లో డ్రగ్స్ రవాణా అవుతున్నట్టు సమాచారం అందడంతో సీబీఐ బృందం వైజాగ్ చేరుకొని దాడులు చేశాయని, స్థానిక పోలీసుల వల్లే సోదాలు ఆలస్యం అనడం సరికాదని సీపీ రవిశంకర్ తెలిపారు. శుక్రవారం పోలీస్ కమిష నరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలోని ప్రైవేట్ కంటైనర్ టెర్మినల్‌లో లభ్యమైన మాదక ద్రవ్యాల కేసును సీబీఐ దర్యాప్తు చేస్తోందని ఇందులో డిలే గానీ పొలిటికల్ ఒత్తిడి గానీ ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు. నార్కోటిక్ డ్రగ్స్‌పై గత ఐదేళ్లుగా ఉక్కు పాదం మోపుతున్నామన్నారు. ఇందుకోసమే స్పెషల్‌గా ఎస్ఈబీ విభాగం కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కంటైనర్ టెర్మినల్ పోలీస్ కమిషనరేట్ పరిధి కాదని వివరణ ఇచ్చారు. సీబీఐ దాడిలో రాష్ట్ర ప్రభుత్వం గానీ, అధికారులు గానీ జోక్యం చేసుకోలేదని సీపీ తేల్చి చెప్పారు. మరోవైపు సీబీఐ సీజ్ చేసిన సరకు ఎంత విలువ ఉంటుంది? మార్కెట్లో దాని ప్రభావం ఏంటనే విషయాలు తెలియాల్సి ఉంది. ఆక్వా రంగంలో మేతకు తాము బ్రెజిల్లో సరకు ఆర్డరిచ్చామని, మత్తుమందు దిగుమతులతో తమకు సంబంధం లేదని సంధ్యా ఆక్వా చెబుతోంది. దిగుమతిదారు అడ్రస్ ఆధారంగా కేసు నమోదు చేసుకున్న సీబీఐ తాజాగా ఎగుమతిదారు వివరాల్ని కూడా ఆరా తీస్తోంది. అందుకు ఇంటర్ పోల్ సహాయం కోసం శుక్రవారం లేఖ కూడా రాసినట్టు సమాచారం.

శ్రీ భరత్‌కే విశాఖ ఎంపీ టికెట్

బీజేపీకి దక్కని ఛాన్స్
టీడీపీకే కూటమి మద్దతు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ పార్లమెంట్ టీడీపీ కూటమి అభ్యర్థిగా మోతుకుమెల్లి శ్రీ భరత్‌ను టీడీపీ శుక్రవారం మూడో విడత అభ్యర్థుల జాబితాలో ప్రకటించింది. 11 అసెంబ్లీ అభ్యర్థులతో పాటు, 13 పార్లమెంట్ అభ్యర్థులను ప్రకటించింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో శ్రీకాకుళం, విశాఖపట్నం ఎంపీ అభ్యర్థులను ప్రకటించగా, అరుకు, అనకాపల్లి, విజయనగరం పార్లమెంట్ అభ్యర్థులను ఇంకా ప్రకటించలేదు. విశాఖపట్నం పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ పొత్తులో భాగంగా తీవ్రంగా కోరినప్పటికీ టీడీపీ మాత్రం విశాఖపట్నంని వదులుకోకుండా దక్కించుకుంది. బిజెపి నుండి రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు, మాజీ కేంద్రమంత్రి దగ్గుబాటి పురంధరేశ్వరి కూడా విశాఖపట్నం నుండి ఈసారి బీజేపీ కోటాలో ఎంపీగా పోటీ చేయాలని తీవ్రంగానే ప్రయత్నం చేశారు. బీజేపీ నేతల ఆశలకు టీడీపీ నీళ్లు జల్లింది. పొత్తులో విశాఖ సీటును వదిలేది లేదని తేల్చి చెప్పింది. అయితే అనకాపల్లి లేదా విజయనగరంలో ఒక పార్లమెంట్ సీటును బీజేపీకి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇక శ్రీ భరత్ విశాఖ వాసి కావడం, యువకుడు, విద్యావంతుడుతో పాటు విశాఖ నగర సమస్యలపై పూర్తిగా అవగాహన కలిగిన నేతగా గత ఎన్నికల్లో పోటీ చేసిన శ్రీ భరత్ సినీ నటుడు బాలకృష్ణకు అల్లుడు కావడం, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు తోడల్లుడు కావడంతో మరోసారి విశాఖ ఎంపీ సీటు కల్పించారని ప్రచారం జరుగుతుంది. 29 సంవత్సరాల వయస్సులోనే రాజకీయ రంగ ప్రవేశం చేసి విశాఖ పార్లమెంట్ స్థానానికి 2019లో పోటీచేసి స్వల్ప మెజారిటీతో ఓటమి పాలైన శ్రీ భరత్ మళ్లీ మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. అమెరికాలోని పర్డూ యూనివర్సిటీ నుంచి ఇంజనీరింగ్ పూర్తి చేసి ప్రపంచ ప్రఖ్యాత స్టాన్ ఫర్డ్ విశ్వవిద్యాలయంలో విద్యారంగంపై ఉన్నత డిగ్రీని చదివిన శ్రీభరత్ మాజీ ఎంపీ స్వర్గీయ డాక్టర్ ఎం.వి.వి.ఎస్.మూర్తి అకాల మరణంతో గీతం విద్యా సంస్థల బాధ్యతను స్వీకరించారు.

బీసీల పక్షపాతి ముఖ్యమంత్రి జగన్

విశాలాంధ్ర - పెందుర్తి: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి బీసీల పక్షపాతి అని అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ జిల్లా అధ్యక్షులు చిప్పల చందు పేర్కొన్నారు. వైసీపీ బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగిడి సాంబశివ రావును అగ్ని (వన్నియ) కులక్షత్రియ జాతీయ అధ్యక్షుడుగా ప్రకటించడాన్ని హర్షిస్తూ చిప్పల చందు ఆధ్వర్యంలో పలువురు సంఘం నాయకులు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ రాష్ట్రంలో 40 లక్షల వరకు ఉన్న అగ్ని(వన్నియ) కుల క్షత్రియులకు ఇప్పటి వరకు ఏ పార్టీ న్యాయం చేయలేదని, నేడు జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైసిపి ప్రభుత్వం గుర్తించి తమ కులానికి బిసి సెల్ అధికార ప్రతినిధి పదవిని కేటాయించటం గొప్ప విషయమని కొనియాడారు. నాగిడి సాంబశివరావు అధ్వర్యంలో అగ్ని (వన్నియ) కులక్షత్రియ సామాజిక వర్గంతో పాటు 139 బిసి కులాలని కలుపుకుని వచ్చే ఎలక్షన్స్‌లో వైసిపికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నికులక్షత్రియ నాయకులు దాసరి సత్తి బాబు, చిప్పల కామరాజు, బర్రె నాగార్జున, బుడత అప్పలరాజు, మెడిసి శ్రీనివాస్, యరబాల సంతోష్, పొతబత్తుల ప్రసాద్, పొన్నాడ జగదీష్, నాగేడి వర్మ, పొతబత్తుల భాస్కర్, పోతుమల్ల రమణ, జోగరావు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

దేశ భవితను మార్చే శక్తి యువత సొంతం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: దేశ భవితను మార్చే శక్తి యువతకు ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. శుక్రవారం ఏయూ వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగ దినో త్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఇంజనీరింగ్ పూర్తిచేసిన తరువాత వాస్తవిక సమాజం విసిరే సవాళ్లకు సిద్ధం కావాలని సూచించారు. మార్కులు, ర్యాంకులు ప్రధానమేనని, అదే సమయంలో సమాజంలో సమన్వయం చేసుకుంటూ పనిచేయడం ఎంతో అవసరమన్నారు. కొన్ని సందర్భాలలో అపజయాలు ఎదురవుతాయని వాటిని అధిగమిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. చేసే పనిపై ఏకాగ్రత కలిగి ఉండటం, కష్టించే తత్వం ఎంతో అవసరమన్నారు. సృజనాత్మకంగా ఆలోచన చేయడం, నిత్యనూతనత్వంతో పనిచేయడం అలవాటు చేసుకోవాలన్నారు. మానసికంగా, శారీరకంగా ధృఢంగా తయారు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషన రావు, విభాగాధిపతి ఆచార్య ఆచార్య పి.మల్లికార్జున రావు, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రేయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - పెందుర్తి: ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం సందర్భంగా శ్రేయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సుజాతనగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఉషాదేవి ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగులు డౌన్ సిండ్రోమ్ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషాదేవి మాట్లాడుతూ ప్రతి వెయ్యి మంది పిల్లల్లో ఒకరు ఈ డౌన్ సిండ్రోమ్ డిజార్డర్‌తో బాధపడుతున్నారని, ఇలాంటి అనారోగ్య పరిస్థితిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతీఏటా మార్చి 21న వరల్డ్ డౌన్ సిండ్రోమ్ దినోత్సవంగా పాటిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ ట్రైనర్ యం.భాగ్యలక్ష్మి, సైకాలజిస్ట్, గైడెన్స్ కౌన్సిలర్ కే.సంతోషి, అసిస్టెంట్ టీచర్ కే.కుమారి, ఫౌండేషన్ ఇన్‌చార్జ్, హెచ్.ఆర్ కే.సురేష్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్ఐటీలో జల దినోత్సవం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో ఉన్న నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల నందు శుక్రవారం జల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సెమినార్ నిర్వహించారు. నీటి ప్రాముఖ్యత, పొదుపు గురించి మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో వున్న తాగునీటి సమస్యలు, కొన్ని ప్రాంతాలలో ప్రజలు కనీస నీరు లేక పడుతున్న ఇబ్బందులను వివరించి నీటి పరిరక్షణ మొదలగు అంశాలపై మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, డాక్టర్ ఎస్ శంభు ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ జే. రాజ మురుగదాస్ , డైరెక్టర్ హరగోపాల్, ఎన్ఎస్ఎస్ పీఓ షణ్ముకేష్, సివిల్ విభాగాధిపతి ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జల దినోత్సవం

విశాలాంధ్ర - విశాఖ: ఇస్కాఫ్ ఆధ్వర్యంలో జీవీఎంసీ ఎదురుగా గల గాంధీ విగ్రహం వద్ద ప్రపంచ జల దినోత్సవాన్ని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ కులపతి ప్రొఫెసర్ బాల మోహన్ దాస్ హాజరై మాట్లాడుతూ జలాలు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నీటి వినియోగాన్ని అవసరమైన మేరకు మాత్రమే వినియో గించాలని సూచించారు. 2040 నాటికి ప్రపంచంలో భూగర్భ జలాలు చాలావరకు తగ్గిపోయే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని, ఈ తరుణంలో జలాలను సక్రమంగా వినియోగించే విధంగా అవగాహన కల్పించా లన్నారు. మనకు ఉండే నీటి చెరువులు, రిజర్వాయర్‌లు, మంచినీటి బావులు వాటిని సక్రమంగా వినియోగించే రీతిలో సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇస్కాఫ్ జాతీయ నాయకులు సుకుమారన్, ప్రభాకర్, నగర నాయకులు రాం ప్రభు, సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి, ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజమాణిక్య, ఇస్కాఫ్ మహిళా ప్రతినిధులు ఎం.మధుమతి, పి.సత్యవతి, పావని తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు వెండి కవచాలు బహూకరణ

విశాలాంధ్ర - సాగర్‌నగర్: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నగరానికి చెందిన ఆరుగురు స్నేహితులు రూ.20 లక్షల విలువ చేసే ఆభరణాలను విరాళంగా ఇచ్చారు. ఆలయంలో గల శ్రీ గోదాదేవి అమ్మవారికి, పద్మావతి అమ్మవారికి, ఆంజనేయ స్వామికి ఈ వెండి కవచాలు సమర్పించారు. చెక్క శ్రీరామ మూర్తి, చెక్క తాతబాబు, పువ్వాడ శేషగిరిధర్, సంక మృత్యుం జయరావు, గ్రంధి రాంజీ, డాక్టర్ భవాని ప్రసాద్, టి.గణేష్ కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవార్లకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ జగన్మోహన్, ఆచార్యులు ఆర్య ఇన్‌స్పెక్టర్లు శివ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటలే మేలు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామివారి కృష్ణాపురం గోశాలలో శబల (గోవు) భోజనాల ఆధారిత భోజనాల పండగ ఐదు రోజుల పాటు జరగనుంది. ముఖ్య అతిథిగా దేవాదాయ శాఖ ఏడీసీ, అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ మాట్లాడుతూ రైతు క్షేమంగా ఉంటేనా ప్రపంచం క్షేమంగా ఉంటుందని, సేంద్రియ ఎరువులతో పండిన పంటను తింటే ప్రజలు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవిస్తారని అన్నారు. గోవు నంది లేకుంటే మానవ మనుగడ లేదని కార్యక్రమం నిర్వాహకులు విజయరామ్ అన్నారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసమూర్తి, ప్రధాన అర్చక స్వాములు జి.శ్రీనివాసాచార్యులు, రాజగోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

విశాలాంధ్ర - మల్కాపురం: విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథక ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ్ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ -1, 2 ఆధ్వర్యంలో ఇందిరా కాలనీ, బర్మా కాలనీలలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరాల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వారం రోజులుగా వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టిన విద్యార్థినులను ఆయన అభినందించారు. వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో యూనిట్ -1 ప్రోగ్రాం అధికారి ఎ.సంధ్యారాణి, కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, జూనియర్ కాలేజ్ యాజమాన్య ప్రతినిధి సిస్టర్ జయశీల, సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి, ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

భీమిలి అసెంబ్లీ టికెట్ సందీప్‌కు కేటాయించాలి

విశాలాంధ్ర - ఆనందపురం: యువకుడు, ఉత్సాహవంతుడు సమస్యలపై పోరాటం చేయగల సమర్థుడు భీమిలి జనసేన పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ సందీప్ పంచకర్లకు భీమిలి నియోజకవర్గం అసెంబ్లీ టికెట్‌ను కూటమిలో భాగంగా జనసేనకు కేటాయించాలని విశాఖ జిల్లా జనసేన పార్టీ రూరల్ కార్యదర్శి మజ్జి శ్రీను డిమాండ్ చేశారు. 2019 సంవత్సరంలో సుమారుగా భీమిలి నియోజకవర్గంలో 25 వేల ఓట్లను సాధించుకున్నారని దానితోపాటు నియోజకవర్గంలో ఎక్కడ సమస్య ఉన్నా ముందుండే వ్యక్తి అందరికి అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నారని అన్నారు. జనసేన టికెట్ సందీప్‌కు కేటాయించాలని కోరారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని తుని వలస గ్రామపంచాయతీలో గత 2019 ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువ కావడంతో ఈ ఏడాది ఎన్నికల మండల స్థాయి అధికారులు తుని వలస గ్రామంలో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అన్ని శాఖల అధికారులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తన ఓటు హక్కును నిర్భయంగా ఉపయోగించుకోవాలని పద్మనాభం సీఐ సిహెచ్ శ్రీధర్ గ్రామస్తులకు వివరించారు. ఎవరికి భయపడకుండా, లేనిపోని అపోహలు భయభ్రాంతులకు చెందకుండా ఉండేందుకే పోలీస్ శాఖ సహకరిస్తుందని అన్నారు. ఈ గ్రామంలో ఓటింగ్ శాతం నమోదు తక్కువ కాకుండా ఉండాలని ఆయన అన్నారు. మీకు నచ్చిన పార్టీల వ్యక్తులకు ఓటు వేసుకొనే హక్కు మన చట్టాలు ఇచ్చాయన్నారు.

క్రోమా వేసవి క్యాంపెయిన్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: క్రోమా తమ వేసవి ప్రచారాన్ని మే 2024 వరకు ప్రకటించింది. వేసవి ప్రారంభంతో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను ఎదుర్కో వడానికి, కస్టమర్‌లు తమ ఇళ్లను సిద్ధం చేసుకునేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వేళ ఎదురులేని డీల్స్, చెల్లింపు సౌలభ్యంతో తాజా గాడ్జెట్‌లతో సమ్మర్ సేల్ సరైన అవకాశాన్ని అందిస్తుంది. వినియోగదారులు 1.5 టన్ స్ప్లిట్ ఏసీ లను కేవలం రూ. 1,500 నుండి స్టోర్‌లు క్రోమా డాట్ కామ్ లో కనుగొనగలరు. కస్టమర్లు ఏదైనా ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకుని వచ్చి కొత్త ఏసీని ఇంటికి తీసుకెళ్లవచ్చు. 250 కి పైగా ఎయిర్ కండిషనర్లు, 300కి పైగా రిఫ్రిజిరేటర్‌లు, రూమ్ కూలర్‌లు ఫ్యాన్‌లతో ఆకర్షణీయమైన ఎక్స్ఛేంజ్ మరియు అప్‌గ్రేడ్ ఎంపికలు, క్యాష్‌బ్యాక్ ఆఫర్‌లు మరియు 24 నెలల వరకు ఫ్లెక్సిబుల్ ఈఎంఐ ప్లాన్‌లతో రూ. 45000 వరకు ప్రయోజనాలు పొందండి.

ఎస్‌బిఐ కార్డ్ టైటాన్ నుండి కొత్త క్రెడిట్ కార్డ్ విడుదల

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆభరణాలు, గడియారాలు, కళ్ళజోళ్ళు, సంప్రదాయ వస్త్రాల విభాగాల్లో అగ్రగామి సంస్థ టైటాన్ కంపెనీ లిమిటెడ్ భాగస్వామ్యంతో భారతదేశంలోనే అతిపెద్ద ప్యూర్ ప్లే క్రెడిట్ కార్డు జారీదారు ఎస్‌బిఐ కార్డు టైటాన్ ఎస్బిఐ కార్డు ను విడుదల చేసింది. వినియోగదారుల ఆకాంక్షాత్మక వ్యయ అవసరాలను తీర్చడానికి ఈ తరహా షాపింగ్ క్రెడిట్ కార్డును రూపొందించారు. టైటాన్ ఎస్బిఐ కార్డ్ వివిధ జీవనశైలి వర్గాలలో ఖర్చులపై వేగవంతమైన ప్రయోజనాలను అందిస్తుంది. క్యాష్ బ్యాక్ లు టైటాన్ గిఫ్ట్ వోచర్లు మరియు రివార్డ్ పాయింట్స్ వంటి ఫీచర్లతో, కార్డుదారులు సంవత్సరానికి రూ.2,00,000 కంటే ఎక్కువ విలువైన ప్రత్యేక ప్రయోజనాలను పొందవచ్చు. ఎస్బిఐ కార్డ్ వెబ్సైట్ లేదా టైటాన్ స్టోర్లను సందర్శించడం ద్వారా పూర్తిగా డిజిటల్ పద్ధతిలో కార్డు కోసం నమోదు చేసుకోవచ్చు.

వైసీపీలో చేరిన యువత

విశాలాంధ్ర - మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతం పరిధి 58వ వార్డ్ కుంచాలమ్మ కాలనీకి చెందిన యువత నాయకులు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ సమక్షంలో శుక్రవారం వైసీపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన

మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పరిపాలన నచ్చి పార్టీలో చేరారని వీరందరికీ భవిష్యత్తులో పార్టీ తరపున ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గులి గిందల లావణ్య, వార్డు అధ్యక్షులు రాజు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ రాకెట్‌పై చర్యలు తీసుకోవాలి: సీపీఎం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: 25 వేల కిలోల భారీ డ్రగ్ దిగుమతికి పాల్పడిన డ్రగ్ మాఫియాను తీవ్రంగా శిక్షించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గు నాయుడు డిమాండ్ చేశారు. సంధ్య ఆక్వా ఎక్స్ పోర్ట్ సంస్థను ఇప్పటివరకు అరెస్ట్ చేయక పోవడంతో అనేక అనుమానాలు కలుగుతున్నాయన్నారు. అలాగే ఈ సంస్థకు టిడిపి, బీజేపీ, వైసీపీ పార్టీల తో సంబంధాలు ఉన్నట్లు ప్రస్తుతం ఆయా పార్టీల విమర్శలను బట్టి తెలుస్తుందన్నారు. ఈ నెల 16వ తేదీన కంటైనర్ విశాఖ వచ్చినప్పటికీ 21 వరకు ఎందుకు ప్రకటన చేయలేదని, దీని వెనుక బలమైన రాజకీయ వత్తిడి ఉన్నట్లు తెలుస్తుందన్నారు. అందుకనే ఇప్పటివరకు సమగ్రమైన సమాచారాన్ని బహిర్గతం చేయకపోవడంతో పాటు ఎవ్వరినీ అరెస్ట్ చేయలేదని, ఈ దుర్మార్గ వైఖరిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. తక్షణం సమగ్ర దర్యాప్తు జరిపి ఈ డ్రగ్ మాఫియా తో సంబంధం ఉన్న వారందరినీ అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రశాంత విశాఖ నగరాన్ని డ్రగ్స్ కేంద్రంగా పాలక రాజకీయ పార్టీలు మార్చేశాయని, ఈ పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు.

అభయాంజనేయ స్వామి 15వ వార్షికోత్సవం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో లొడగల పంచాయతీ నేలతేరు గ్రామంలో నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి 15వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుండి ఆలయం, స్వామివారికి ధూప దీప నైవేద్యాలతో భజన కార్యక్రమాలతోపాటు, కోలాటం వలు భక్తి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం వద్ద సుమారు 4000 మంది భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బంక సూర్యనారాయణ, పాండ్రంకి అప్పారావు, బంక కృష్ణ నాయుడు, రౌతు వెంకట్రావు పాల్గొన్నారు.

టాటా ఏఐఏ రైజింగ్ ఇండియా ఫండ్‌ను విడుదల చేసిన టాటా ఏఐఏ లైఫ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతదేశంలోని ప్రముఖ జీవిత బీమా సంస్థల్లో ఒకటైన టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ (టాటా ఏఐఏ), టాటా ఏఐఏ రైజింగ్ ఇండియా ఫండ్‌ను విడుదల చేసింది. ఇది భారతదేశ వృద్ధి కథనంలో పాల్గొనేందుకు వినియోగదారుల కోసం ఒక ప్రత్యేక మార్గాన్ని తెరుస్తుంది. ఈ కొత్త ఫండ్ ఆఫరింగ్ (ఎన్ ఎఫ్ ఓ) మార్చి 31, 2024 వరకు తెరిచి ఉంటుందని టాటా ఏఐఏ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ హర్షద్ పాటిల్ తెలిపారు. ఎన్ ఎఫ్ఓ కాలంలో యూనిట్‌కు రూ. 10 ఎన్ ఎ వీతో యూనిట్లు అందించబడతాయి. రైజింగ్ ఇండియా ఫండ్ ఆత్మనిర్భర్ భారత్ కథను నడిపించే కీలక రంగాలు మరియు కంపెనీలలో పెట్టుబడి పెడుతుంది. వీటిలో మౌలిక సదుపాయాలు, తయారీ, బ్యాంకింగ్, డిజిటల్, రక్షణ మొదలైనవి ఉన్నాయన్నారు. టాటా ఏఐఏ అందించే యులిప్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టడం ద్వారా భారతీయ ఈక్విటీ మార్కెట్ యొక్క దీర్ఘకాలిక వృద్ధి సంభావ్యత నుండి మా వినియోగదారులు ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు.

పేద కుటుంబాలకు అండ ఇందిరమ్మ అభయం

విశాలాంధ్ర - భీమిలి: పేదల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ అభయం పథకం రూపొందించడం పట్ల ఎపి ఫిషర్మెన్ కాంగ్రెస్ చైర్మన్ కదిరి జగన్నాథం హర్షం వ్యక్తం చేశారు. భీమిలి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జీవీఎంసీ 2వ వార్డు మామిడిపాలెంలో ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం జరిగింది. ఏపీసిసి జనరల్ సెక్రటరీ గాదం మహేష్ పాల్గొని ప్రతి కుటుంబానికి అండగా ఉండాలని ఆ కుటుంబంలో మహిళ పేరు మీద ప్రతినెల 5 వేల రూపాయలు అందించే విధంగా పథకాన్ని రూపొందించారన్నారు. ఇందిరమ్మ అభయం పథకం అమలు కావాలంటే ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. వైఎస్ఆర్సీపీ నవరత్నాల పథకం కరెంట్ బిల్లులు, నాలుగు చక్రాల వాహనాల వంటి నిబంధనలతో పేదలకు అందడం లేదని ఆయన విమర్శించారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఆభయం పథకం గురించి ఇంటింటికి ప్రచారం చేసి, ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వని, విభజన హామీలను అమలు చేయని బిజెపికి సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రత్యేక హెూదా సాధ్యమవుతుందన్నారు.

టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాల ద్వారా మరింత లబ్ధి చేకూరుతుందని 75 వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి వెంకట రమణా రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా 75వ వార్డులో సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ

కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, మొల్లి రమణ ములకలపల్లి పెంటయ్య, పులి శ్రీరామ రెడ్డి, దొమ్మేటి పెరుమాళ్, నక్క సింహాచలం,,మొల్లి చిట్టిబాబు, బాబు రావు,,దొమ్మేటి సోము నాయుడు ,నామాల శ్రీకాంత్, కాకినాడ అప్పల రాజు దొమ్మేటి అప్పారావు, బస అప్పల రెడ్డి అండి బోయిన రాము నాయుడు గొందేసీ రామిరెడ్డి మొల్లి అప్పారావు, శ్రీముసిరి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని గెలిపించండి

విశాలాంధ్ర - ఆనందపురం: భీమిలి నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి పార్టీ గెలిపించాలని కోరుతూ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ, శాసనసభ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆనందపురం మండలంలో శుక్రవారం ప్రచారం చేపట్టారు. మండలంలోని వెల్లంకి, వేములవలస, ఆనందపురం గంభీరం, గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు.

ప్రచార రథంపై గ్రామ వీధుల్లో పర్యటించి రానున్న ఎన్నికల్లో వైసీపీ పార్టీని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు 93 శాతం హామీలను అమలు పరచామని 2024 ఎన్నికల్లో మరల ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పార్లమెంట్ అభ్యర్థి శాసనసభ అభ్యర్థి అయిన తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఝాన్సీ ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శారద ప్రియాంక కోరాడ వెంకట్రావు, బంక సత్యనారాయణ, కోరాడ రాంబాబు, కాకర వెంకటరమణ ఉప్పాడ లక్ష్మణరావు, అప్పలస్వామి నాయుడు,చందలక్ష్మి చందక లక్ష్మి సూరిబాబు మీసాల పైడిరాజు, షినగం రామారావు, బోట్ల ధనలక్ష్మి రామకృష్ణ, పాండ్రంకి శ్రీను, పినిశెట్టి సింహాచలం నాయుడు, బలిరెడ్డి మహేష్, లంక రాంబాబు, ఇల్లాపు వెంకట జగన్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో అసమానతలను రూపుమాపాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: సమాజంలో అసమానతలను రూపుమాపాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏయూ సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సు 'అండర్‌స్టాండింగ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ ఇన్ ఇండియా-ఎమర్జింగ్ చాలెంజెస్ ఇన్ సోషల్ ఇంక్లూజన్'ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ దేశంలో కులం ప్రజలను విభజిస్తూ వేరుచేస్తోందన్నారు.

కుల ఆధారంగా జరిగే అసమానతలు సమాజంలో అసమానతలకు దారితీస్తాయని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అభిప్రాయ పడ్డారని వివరించారు. ఏయూ ఓఎస్‌డి ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానతలను తొలగించే విధంగా ప్రభుత్వాలు కృషిసల్పాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహా రావు మాట్లాడుతూ కుల అసమానతలను రూపుమాపడం ఎంతో అవసరమని ఈ దిశగా కేంద్రం కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆచార్య వై.చిన్నారావు, కేంద్రం సంచాలకులు డాక్టర్ పి.సుబ్బారావు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్.బాబా వలి, డాక్టర్ బి.శివ రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేంద్రం తరపున అతిధులను సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు.

బీజేపీ రామునాయుడుతో పంచకర్ల భేటీ

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుండి కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న పంచకర్ల రమేష్ బాబు, భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ కన్వీనర్ గొర్లేరాము నాయుడుతో శుక్రవారం ఉదయం భేటీ అయ్యారు. జనసేన పార్టీ నాయకులు అయిత సింహాచలం, సేనాపతి సోమశేఖర్, కంచిపాటి మధు, గొర్లే అప్పారావు తదితరులతో కలిసి పెందుర్తిలోని బిజెపి కార్యాలయానికి

వచ్చిన రమేష్ బాబు రామునాయుడును కలిసి వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం గురించి చర్చించారు. అలాగే పొత్తులో ఎవరెవరు ఏ బాధ్యతలు చేపట్టాలి అనే దాని పైనా మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ బిజెపి కేంద్ర పార్టీ ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థి గెలుపు కోసం పాటుపడతామని స్పష్టం చేశారు నియోజకవర్గంలో బిజెపికి బలమైన కేడర్ ఉందని అన్ని వార్డులు, గ్రామాల్లోనూ సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలనే లక్ష్యంతో గ్రామ గ్రామాన పార్టీని బలోపేతం చేసామని తెలిపారు. బిజెపి శ్రేణులు అందరూ కూటమి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం రమేష్ బాబు మాట్లాడుతూ బిజెపి తెలుగుదేశం జనసేన పార్టీలు కలిసికట్టుగా సాగి రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలనకు ముగింపు పలుకుతామని పేర్కొన్నారు. ప్రధాని మోదీ పెద్దన్న పాత్ర పోషిస్తే చంద్రబాబు విజనరీ లీడర్ గా నాయకత్వం వహిస్తారని, పవన్ కళ్యాణ్ ప్రజలకు మేలు చేసే విధంగా పాలనలో భాగస్వామ్యం అవుతారని స్పష్టం చేశారు. పొత్తులో సీటు ప్రకటించిన తర్వాత మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిని కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకుంటానని తెలిపారు. అనంతరం మూడు పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి ఎన్నికల్లో గెలుపు వ్యూహాలు రచిస్తామన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియా పెరిగిపోయిందని జగన్ పాలనలో అరాచకాలకు అడ్డు అదుపు లేదని మండిపడ్డారు. రాష్ట్రం బాగుపడాలంటే కూటమి అధికారంలోకి రావాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

క్షయ నివారణపై జిమ్‌సర్‌లో అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర - మధురవాడ: ప్రపంచ క్షయనివారణ (ప్రపంచ టిబి దినం) దినోత్సవ సందర్భంగా గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(జిమ్‌సర్) లో శుక్రవారం తేది:22-03-2024న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు వై.ఎస్.ఆర్.విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ కె.బాబుజి, విశాఖ టి.బి.కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ సి.హెచ్. ఫణేంద్రబాబు, విశాఖ ఛాతి ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ ఆర్.సునీల్ కుమార్, జిమ్‌సర్ ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, జిమ్‌సర్ శ్వాసకోశ వ్యాధుల విభాగం అధిపతి డాక్టర్ సాంబశివరావు, జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్.పి.రావు హజరై ప్రసంగించారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలోని అత్యంత ప్రమాదకరమైన వ్యాధులలో టిబి ఒకటని, దీని కారణంగా ఏటా 1.6 మిలియన్ల జనాభా మరణిస్తున్నారని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2030 సంవత్సరం నాటికి టిబిని పూర్తిగా అరికట్టాలన్న లక్ష్యంతో ప్రపంచ దేశాలకు దిశ నిర్దేశం

చేసిందన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరు టిబి వ్యాప్తి పట్ల అవగాహన కలిగి ఉండాలని, నివారణకు కృషి చేయాలని సూచించారు. టిబి వ్యాప్తిని అరికట్టడానికి వ్యాధినిరోధక శక్తిని పెంచుకునేలా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో జిమ్‌సర్ ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ నిఖిల, డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డాక్టర్ జి.ఇందిర, డాక్టర్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు టిబి నివారణకు సంబంధించిన నినాధాలను ప్రదర్శించారు.

నీటి నిల్వలను కాపాడుకోవాలి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: "ప్రపంచ నీటి దినోత్సవం" సందర్భంగా జన విజ్ఞాన వేదిక, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంయుక్తగా భూగర్భ జలాలు రక్షించాలని, నీటి నిల్వలను కాపాడుకోవాలని, వర్షపు నీటిని వడిసి పట్టాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొత్తగాజువాక హైస్కూల్ రోడ్ మీదుగా ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు అంబేద్కర్, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి డి.వేణుగోపాల్ జండా ఊపి ర్యాలీని ప్రారంభోత్సవం చేశారు. అనంతరం జె వి వి జిల్లా పర్యావరణ కన్వీనర్ పాలూరి లక్ష్మణ స్వామి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ భూగర్భ జలాలు రక్షించే కార్యక్రమాన్ని ప్రభుత్వాలు బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎస్వికే.పరశురామ్ మాట్లాడుతూ ప్రజలకు అందించాల్సిన మంచి నీటిని వ్యాపార సరుకుగా మార్చి కార్పొరేట్ సంస్థలు కోట్లు గడిస్తున్నాయి అన్నారు. సామాన్య ప్రజలు నీటిని కొనుక్కోవాలి పరిస్థితి వచ్చిందన్నారు. మంచినీటి వ్యాపారం అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేణుగోపాల్ మాట్లాడుతూ నీటిని వృధా జరగకుండా విద్యార్థులు, ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో "కూర్మమ్మ స్కౌట్ యూనిట్" సభ్యులు, టీచర్స్ పద్మజ,సూర్యకుమారి, ఎస్.ఆర్.లక్ష్మీ, స్వర్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శిగా పలమరశెట్టి బాధ్యతలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: తెలుగుదేశం పార్టీ ప్రతి ఒక్కరిని గుర్తిస్తుందని మాజీ మంత్రి ఉత్తర నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ పార్లమెంటు ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పాలమర శెట్టి శ్రీనివాసరావు శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గంటా శ్రీనివాసరావు మాట్లాడారు.తెలుగుదేశం పార్టీలో సామాన్య కార్యకర్తలకు కూడా గుర్తింపు లభిస్తుందని ఇదుకు పాలమరశెట్టి శ్రీనివాసరావు సాక్ష్యం అని అన్నారు. ప్రతి కార్యకర్త తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవానికి కృషి చేయాలని చెప్పారు. జరగబోయే ఎన్నికలలో తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు వేపాడ చిరంజీవి రావు. విశాఖ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు గణబాబు. మాజీ శాసనసభ్యులు వి విష్ణుకుమార్ రాజు.

చిక్కాల విజయబాబు. కార్పొరేటర్లు గొల్లగాని వీర రావు. దాడి వెంకట రమేష్ , గోడి నరసింహ చారి, పోలమరి శెట్టి నరసకుమారి, కేదారి లక్ష్మి, బొడేటి మోహన్, పివి రమణ, కోయిలాడ వెంకట్, విల్లూరి చక్రవర్తి, ఎర్నాగుల జగదీష్, ఈతలపాక సుజాత, ఊరుకుటి దేవిడ్, పి.జయరాజ్, జాన్, గొర్లె అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన అమెరికా నావికాదళ బృందం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని అమెరికా నావికాదళ బృందం శుక్రవారం ఉదయం సందర్శించారు. ముందుగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో పరిపాలనా భవనంలో సమావేశమయ్యారు. యుఎస్ నేవీ కెప్టెన్ కమాండింగ్ ఆఫీసర్, ఎస్-ఎస్ఎస్ సోమిర్‌సెట్(ఎల్‌పిడి 25) కెప్టెన్ మిచెల్ సి. బ్రాండ్ నేతృత్వంలో పలువురు నావికాదళ సిబ్బంది ఏయూను సందర్శించారు. వీరికి ఏయూ ఎన్‌సిసి విద్యార్థుల బృందం గౌరవ వందనంతో స్వాగతించారు. అనంతరం అకడమిక్ సెనేట్ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో అమెరికా నావికాదళ సిబ్బందిని ఉద్దేశించి వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ప్రసంగించారు. ఏయూలో ఒక మల్టీడిసిప్లీనరీ విశ్వవిద్యాలయంగా నిలుస్తుందన్నారు. క్రీడలు, యోగా, సైకాలజీ, సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ వంటి వైవిధ్యత కలిగిన విభాగాలు ఉన్నాయన్నారు. దేశంల రక్షణ రంగాలకు విద్యపరంగా సేవలు అందిస్తున్న వర్సిటీకీ ఏయూ పేరుగాంచిందని వారికి వివరించారు. వైవిధ్యతను తాము స్వాగతిస్తామని, యుఎస్ఏ నావికలు తమ ఆలోచనలను పంచుకోవాలని కోరారు. మంచి స్నేహాన్ని తాము కోరుకుంటామన్నారు. ప్రపంచాన్ని అత్యంత ఆనందాయకంగా నిలపాని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారత దేశంలో త్రివిధ దళాల ఉద్యోగులకు ఉన్నత విద్యను చేరువ చేసే దిశగా ఏయూ పనిచేస్తోందని, భవిష్యత్తులో విదేశీ సైనికులకు సైతం ఉన్నత విద్య అవకాశాలను కల్పించడానికి సిద్దంగా ఉన్నామన్నారు. అమెరికా నావికాదళం కమాండింగ్ ఆఫీసర్ మిచెల్ సి. బ్రాండ్ మాట్లాడుతూ సిటీ ఆఫ్ డెస్టినీగా పేరుగాంచిన విశాఖ నగరం తమకు ఎంతో నచ్చిందన్నారు. సముద్రతీరం, ఎత్తైన కొండలు కలిగిన ఈ ప్రాంతం తమకు నచ్చిందన్నారు. భారతీయ సంస్కృతిని తాము నేర్చుకుంటున్నామన్నారు. విభిన్న విభాగాలతో పెద్ద విశ్వవిద్యాలయంగా ఏయూ తమకు కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, అమెరికన్ ఎంబసీ అధికారి జో క్రిష్టోఫర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏయూ అమెరికన్ కార్నర్ వద్ద మెక్కలు నాటే కార్యక్రమం, వాల్ పెయింటింగ్ కార్యక్రమాలలో అమెరికా నావికాదళ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం అమెరికన్ కార్నర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అమెరికా నావికాదళం కమాండింగ్ ఆఫీసర్ సి.బ్రాంట్ ప్రసంగించారు.

మహీంద్రా ఆల్ ఎలక్ట్రిక్ ఎక్స్ యూవీ 400 ప్రో రేంజ్ విడుదల

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశపు ప్రముఖ ఎస్యూవీ తయారీదారు మహీంద్రా మహీంద్రా లిమిటెడ్, ఈ రోజు ఎక్స్ యూవీ 400 ప్రో రేంజ్‌ను 15.49 లక్షల నుండి ప్రారంభ ధరతో విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. తాజా ప్రో శ్రేణి మూడు కొత్త వేరియంట్‌లను పరిచయం చేసింది. ఈ లాంచింగ్ ప్రోగ్రాం లో పాల్గొన్న ఆటోమేటివ్ మ్యానుఫ్యాక్చరర్స్ సీఓఓ సిహెచ్ శ్రీనివాసరెడ్డి, జీఎం బి. శ్రీనివాస్, నియోన్ మోటార్స్ జనరల్ మేనేజర్ మురళీకృష్ణ, మహేంద్ర ఫైనాన్స్ హెడ్ రాజ్ కుమార్, రతిరాం ఠాగూర్ ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈసీ ప్రో (34.5 కే డబ్ల్యు హెచ్ బ్యాటరీ, 3.3 కే డబ్ల్యు ఏ సీ ఛార్జర్), ఈ ఎల్ ప్రో (34.5 కే డబ్ల్యు హెచ్ బ్యాటరీ, 7.2 కే డబ్ల్యు ఏ సీ ఛార్జర్), ఈ ఎల్ ప్రో (39.4 కే డబ్ల్యు హెచ్ బ్యాటరీ, 7.2 కేడబ్ల్యుఏసీ ఛార్జర్) అనే మూడు వేరియంట్లలో అందుబాటులో ఉందన్నారు. ఒక్కొక్కటి అధునాతన ఫీచర్లు మెరుగైన సౌకర్యాన్ని అందిస్తోం దన్నారు. ఎక్స్ యూవీ 400 ప్రో రేంజ్ యొక్క కాక్‌పిట్ ఆధునిక కనెక్టివిటీ సౌలభ్యం కోసం రూపొందించబడిన 26.04 సెం.మీ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ మరియు 26.04 సెం.మీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌తో సహా అధునాతన సాంకేతికతను కలిగి ఉందన్నారు. దీనికి జోడించడంతోపాటు, ఎడ్రానాక్స్ కనెక్ట్ చేయబడిన

కార్ సిస్టమ్ 50కి పైగా కనెక్ట్ చేయబడిన లక్షణాలను అందించడం డ్రైవింగ్ భద్రత, యాజమాన్య అనుభవం మరియు మొత్తం వాహన కార్యాచరణను మరింత మెరుగుపరుస్తుందన్నారు. అదనంగా ప్రో రేంజ్ డ్యూయల్-జోన్ ఆటోమేటిక్ టెంపరేచర్ కంట్రోల్‌తో ఎలివేటెడ్ క్యాబిన్ అనుభవాన్ని అందిస్తుందన్నారు. ఆల్-ఎలక్ట్రిక్ ఎస్ యూ వీ పరిచయంతో దాని సాంకేతిక సామర్థ్యాలను మరింత మెరుగుపరుస్తుం దన్నారు. వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో మరియు యాపిల్ కార్‌ప్లే ఫీచర్‌లు ఓవర్‌లో అందుబాటులోకి వస్తాయన్నారు. ఎక్స్ యూ వీ 400 ప్రో రేంజ్ దాని కొత్త నెబ్యులా బ్లూ కలర్‌తో బోల్డ్ స్టేట్‌మెంట్‌ను చేస్తుందన్నారు.

202 మంది గీతం విద్యార్థులకు ఉద్యోగాలు

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ద్వారా ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తూ ఆఖరి ఏడాది లోకి ప్రవేసించిన విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు ప్రారంభం అయ్యాయి. గత రెండు రోజులుగా ప్రముఖ ఐటి కంపెనీలు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్), క్యాప్ జెమిని నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 202 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరక్టర్ వంశీకిరణ్ సోమయాజుల శుక్రవాం తేది:22-03-2024న వెల్లడించారు. క్యాప్‌జెమిని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగాలకు 90 మంది విద్యార్థులను ఎంపిక చేసుకోగా, టిసిఎస్ 112 మంది విద్యార్థులను అసిస్టెంట్ సిస్టమ్ ఇంజనీర్ ఉద్యోగాలకు ఎంపిక చేసుకుందని తెలిపారు. ఎంపికైన గీతం విద్యార్థులకు ఏడాదికి రూ.4.25లక్షల వార్షిక వేతనం నుంచి రూ.11 లక్షల వార్షిక వేతనం వరకు లభించనున్నదని ఆయన పేర్కొన్నారు. మరికొన్ని ప్రముఖ సంస్థలు డెల్లాయిట్, ఐబిఎమ్, మూసిగ్మా, ఫ్యూచర్ ఫస్ట్, బోష్, మైక్రాన్, హుండాయ్, టాటా ఎలాక్సి గీతం విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు జరపడానికి ఆసక్తి కనబరిచాయని ఆయన పేర్కోన్నారు. ప్రముఖ అంతర్జాతీయ సంస్థలో ఉద్యోగాలు సాధించడానికి గీతం జిసిజిసి ద్వారా ఇచ్చిన శిక్షణ, వ్యక్తిత్వ వికాస తరగతులు, సాంకేతిక సదస్సులు, నమూనా ఇంటర్వ్యూలు, హ్యాక్‌థాన్ పోటీలు ఉపయోగపడ్డాయని ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ అభినందించారు. విద్యార్థులలో నైపుణ్యాలను పెంచడానికి పరిశ్రమలతో కలిసి సిలబస్‌లో మార్పులు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిసిజిసి డిప్యూటీ డైరక్టర్ ఎ.వెంకటేష్ మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలను గుర్తించి విద్యార్థులకు శిక్షణ ఇవ్వటం ద్వారా మెరుగైన ఫలితాలను సాధిస్తున్నామన్నారు.